క్లుప్తంగా

కక్షిదారులకు చలివేంద్రం ఉపయోగకరం



కక్షిదారులకు నీరు పోస్తున్న సివిల్ జడ్జి

సుల్తానాబాద్: కోర్టుకు పలు కేసుల వాయిదాలకు వచ్చే కక్షిదారులకు చలివేంద్రం ఉపయోగకరంగా ఉంటుందని మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. కోర్టు ఆవరణలో గురువారం ఆమె చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్ ప్రసాద్, న్యాయవాదులు ఆంజనేయులు, సర్వోత్తమ్‌రెడ్డి, భూమయ్య, శివ ఉన్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం



అభినందన పత్రం అందిస్తున్న ప్రతినిధులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ టీ1–362 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న నూతిరాం నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతడి కుటుంబ సభ్యులు రాంనారాయణ నేత్రాలను దానం చేశారు. మృతుడి సంస్మరణ సభను గురువారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మృతుడి కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు చంద్రమౌళి, సాయి శ్రావణ్, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, వైకే ఫౌండేషన్ అధ్యక్షుడు కందెం సురేశ్, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఈజీఎస్ ఏపీవో సదానందం పరిశీలించారు. గ్రామంలోని ఎస్సారెస్పీ ఉప కాలువల పూడికతీత పనులు, కూలీలు తీస్తున్న పూడికతీత తీరును, కూలీలకు వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటకు చెందిన పిడుగు ఓదెలుకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.28వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం అందజేశారు. సర్పంచ్ కొండ వెంకటేశ్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, నాయకులు అనవేన వేణు, ఎద్దు రాజయ్య, దండె కిషన్, రాసకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

గోశాల షెడ్డు నిర్మాణానికి రేకులు అందజేత



రేకులు అందజేస్తున్న తుమ్మ రాజ్‌కుమార్

సుల్తానాబాద్: పట్టణంలోని యాదవ్‌నగర్‌లో ఉన్న శ్రీధర్మశాస్త్ర గోశాలకు రేకులు, ఇసుకను యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తుమ్మ నిశాంత్ అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు బండారి సూర్యం విజ్ఞప్తి మేరకు రాజ్‌కుమార్ తన తల్లిదండ్రులు స్వర్గీయ తుమ్మ నారాయణమ్మ–రాజయ్య జ్ఞాపకార్థం గురువారం రేకులు, ఇసుక అందజేసినట్లు తెలిపారు. వారి వెంట శ్రీనివాస్ ఉన్నారు.

ఫాంపాండ్ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీవో సుదర్శన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కుర్మపల్లిలో గురువారం ఉపాధి కూలీలు చేపట్టిన ఫాంపాండ్ పనులను ఎంపీవో సుదర్శన్ పరిశీలించారు. అలాగే గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలను కాపాడాలని సూచించారు.

‘పది’లో రెండేళ్లుగా వందశాతం ఉత్తీర్ణత

- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఎల్లంపల్లి కస్తూర్బా విద్యాలయం
- ప్రతి విద్యార్థిపై పర్యవేక్షణ, ప్రత్యేక తరగతులు
- ఎస్సెస్సీలో అత్యధికం 9.3 జీపీఏ, ఇంటర్‌లో 951 మార్కులు



ఎల్లంపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

రామగుండం: అంతర్గాం మండల కేంద్రం పరిధిలో ఎల్లంపల్లి గ్రామ శివారులో ప్రభుత్వం మూడేళ్ల క్రితం 2021లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఏర్పాటు చేసింది. కాగా రెండేళ్లుగా పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నిర్మించిన కస్తూర్బా విద్యాలయ భవనంలో విశాలమైన 15 గదుల్లో డార్మెటరీ హాల్స్‌తో పాటు తరగతి గదులున్నాయి. మంచి సౌకర్యాలతో కూడిన వసతి, నాణ్యమైన భోజనం, భవన పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు, ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ, వారాంతంలో అన్ని సబ్జెక్టులపై పరీక్షల నిర్వహణ, కఠిన సబ్జెక్టులపై విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తారు.

2021లో ప్రారంభమైన విద్యాబోధన..

2021లో ప్రారంభమైన విద్యా సంవత్సరంలో భాగంగా 39 మంది పదో తరగతి విద్యార్థులు 2022లో పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించగా ఒక విద్యార్థిని 10జీపీఏ సాధించడం విశేషం. 2023లో 43 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. కాలువ అక్షర 9.3 జీపీఏతో మొదటిస్థానంలో నిలిచింది. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో 28 మంది పరీక్ష రాయగా 23 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో ఇందారపు అక్షయ 951/1000 మార్కులు సాధించింది.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



విద్యార్థులు సాధించే ఫలితాలే మా పనితనానికి నిదర్శనం. కేజీబీవీ స్థాపించినప్పటి నుంచి వరుసగా రెండో ఏడాది ‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉంది. విద్యార్థినులకు మెరుగైన వసతి, నాణ్యమైన భోజనం అందించడమే కాకుండా వారిపై ప్రత్యేక దృష్టిసారిస్తాం.

– తౌటం కల్పన, కేజీబీవీ ప్రత్యేకాధికారి

భద్రతతో కూడిన వసతి



మాది వ్యవసాయ కుటుంబం. ఎల్లంపల్లి కస్తూర్బా ఉపాధ్యాయుల కృషి మరువలేనిది. నాకైతే బడికి వెళ్లినట్లు లేదు. ఇంట్లోనే సార్లను పెట్టుకొని చదువుకున్నట్లుంది. మంచి భోజనం, భద్రతతో కూడిన వసతి ఇవే చదువును ప్రోత్సహిస్తాయని నా నమ్మకం.

– కాలువ అక్షర, ఆకెనపల్లి

పట్టుదలతో చదివాను



ప్రస్తుతం కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇంటర్ పూర్తి చేయాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. మాది వ్యవసాయ కుటుంబం. పట్టుదలతో చదివి ఇంటర్‌లో మంచి మార్కులు సాధించాను. నీట్‌లో ర్యాంకు వస్తుందనే నమ్మకం ఉంది.

– ఇందారపు అక్షయ, సోమనపల్లి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

యైటింక్లయిన్‌కాలనీ: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో శ్రీఅయ్యప్పస్వామి పునఃప్రతిష్ఠాపనలో భాగంగా బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో పంచలోహాలతో తయారు చేస్తున్న శ్రీఅయ్యప్పస్వామి విగ్రహ ప్రతిమకు బంగారం స్వయంగా సమర్పించుకున్నారు. 23 నుంచి 29 వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 29న పునఃప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీసారంగచారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, కోశాధికారి కందెం సురేశ్, కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, స్టాలిన్ గౌడ్, రాయమల్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

జ్యోతినగర్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి కార్మిక, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ కమిషనరల్ లేబర్ కోటేశ్వర్, ఏఎల్‌వో శ్రీకాంత్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు ద్వారా పొందే ప్రయోజనాలు, పథకాల గుర్తించి వివరించారు. లేబర్ కార్డులు లేని కార్మికులు వివరాలతో నమోదు చేసుకుని కార్డులు పొందాలని సూచించారు. తిరుపతి, శంకర్, నాగరాజు, ప్రసాదరావు, మల్లేశ్, గోషికయ సురేశ్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క సీఎం కేసీఆర్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ సీఎం గీత కార్మికుల సంక్షేమం కోసం రైతుబీమా తరహాలో గీత కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం హర్షణీయమన్నారు. గీత కార్మిక సంఘం అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, భూమాగౌడ్, రవి, కృష్ణ, లక్ష్మణ్, తిరుపతి, శంకర్, అనిల్, రమేశ్, వెంకటేశ్, అంజయ్య పాల్గొన్నారు.

అన్నదాతపై అదనపు భారం

- అకాల వర్షాలకు నేలవాలిన వరి
- కోతకు అదనపు ఖర్చు
- తగ్గిన దిగుబడి.. ఆందోళనలో రైతులు



నేలవాలిన వరిని హార్వెస్టర్‌తో కోయిస్తున్న రైతు

ఎలిగేడు: యాసంగి సీజన్‌లో వరిపంట సాగు చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఏప్రిల్‌లో కురిసిన భారీ వర్షాలకు చేతికి వచ్చిన వరి దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వడగండ్ల వానకు ధాన్యం రాలిపోయింది. ఈదురుగాలులకు వరి నేలవాలడంతో అన్నదాతలపై అదనపు భారం పడింది. మండలంలోని బుర్హాన్‌మియాపేట, సుల్తాన్‌పూర్, శివపల్లి, నర్సాపూర్, ఎలిగేడు, లాలపల్లి, ముప్పిరితోట, రాములపల్లి, ర్యాకల్‌దేవుపల్లి, ధూళికట్ట, లోకపేట, నారాయణపల్లి గ్రామాల్లో దాదాపు 13,450 ఎకరాల్లో వరిపంట సాగుచేశారు.

పెరిగిన పెట్టుబడి..

యాసంగి సీజన్ ప్రారంభంలో వరిపంటకు తెగుళ్లు సోకడంతో పంటను రక్షించుకునేందుకు రైతులు డబ్బులను లెక్క చేయకుండా సుమారు 5 నుంచి 6సార్లు రసాయన మందులను పిచికారీ చేశారు. చివరికి పంట చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షాలకు వరిధాన్యం రాలిపోయింది. మిగతా పంట నేలవాలడంతో కోతలకు రైతులు అదనపు చార్జీలను చెల్లిస్తున్నారు. ఎకరానికి రూ.2వేల నుంచి రూ.3వేల వరకు అదనంగా ఖర్చులు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి అంతంతే..

అకాల వర్షాలు, వడగండ్ల వర్షాలకు వరిధాన్యం రాలిపోవడంతో దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎకరాకు సుమారు 20 నుంచి 25క్వింటాళ్లు వచ్చేదని ప్రస్తుతం ఎకరాకు కనీసం 15 క్వింటాళ్లు కూడా రావడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎకరం సాగుకు సుమారు రూ.30వేల పెట్టుబడి పెట్టామని, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు దిగులు చెందుతున్నారు.

అదనపు భారం తప్పడం లేదు



పది ఎకరాల్లో వరిసాగు చేశాను. పంట చేతికి వచ్చిన సమయంలో కురిసిన వడగండ్ల వర్షాలకు వరి నేలవాలింది. దీంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. హార్వెస్టర్ సాయంతో కోసినప్పటికీ నేలవాలిన వరిని కోయటానికి అదనపు భారం తప్పడం లేదు.

– బాలుసాని పర్శరాములుగౌడ్, రైతు, ధూళికట్ట

చెరువుమట్టి అక్రమ తరలింపును ఆపాలి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పలు ఇటుకబట్టీలకు చెరువుమట్టిని అక్రమంగా తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీపీలు సి.సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి ఆరోపించారు. పట్టణంలోని సత్యనారాయణ రెడ్డి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాహిత స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూసేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినా ఇవ్వడం లేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలకు అనుగుణంగా పనులు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అధికారులు ఎమ్మెల్యేల ఆదేశాలకు అనుగుణంగా కాకుండా చట్టప్రకారం పనిచేయాలన్నారు. సమావేశంలో హాజీ, రవూఫ్, మునీర్ తదితరులు ఉన్నారు.

కనుకులలో హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకులలో హనుమాన్ మాలధారులు హనుమాన్ శోభాయాత్రను గురువారం సాయంత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామంలోని పురవీధుల గుండా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. అయ్యగారు కాండురి వాసు, హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

ధాన్యం దించుకోలేదని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

సుల్తానాబాద్‌రూరల్: ధాన్యం రంగు మారిందని రైస్‌మిల్ యజమాని దిగుమతి చేసుకోకుండా ధాన్యం వెనక్కి పంపించినందుకు సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటకు చెందిన రైతులు గురువారం కాల్వశ్రీరాంపూర్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు పొన్నం తిరుపతి మాట్లాడుతూ రేగడిమద్దికుంటలోని కొనుగోలు కేంద్రంలో 150 బస్తాల ధాన్యం విక్రయించినట్లు తెలిపాడు. ధాన్యాన్ని సుల్తానాబాద్‌లోని ఓ రైస్‌మిల్‌కు తరలించగా అక్కడ రైస్‌మిల్ యజమానులు రంగు మారిందని కొర్రీలు పెట్టి ధాన్యాన్ని తిరిగి పంపించారని వాపోయారు. ధాన్యం తడిసినా, రంగు మారినా ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ మిల్లర్లు ఇలాంటి షరతులు పెట్టి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేస్తామని ప్రకటించినవిధంగా ధాన్యం కొనాలని రైతులు డిమాండ్ చేశారు. ఆందోళనలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి కోసమే విజయ సంకల్ప యాత్ర



యాత్రలో న్యూ ఇండియా పార్టీ నాయకులు

జ్యోతినగర్: సామాన్యుడి కోసమే ఆర్థిక స్వేచ్ఛ విజయ సంకల్ప యాత్ర చేపడుతున్నట్లు న్యూ ఇండియా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జేవీ రాజు తెలిపారు. యాత్ర గురువారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌కు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థిక స్వేచ్ఛను పొందేందుకు ప్రతిఒక్కరూ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆధార్ కార్డు ఉన్న అందరికీ నెలకు రూ.5వేలు ఇవ్వాలని, ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు పరిశ్రమలు స్థాపించాలన్నారు. నేటి పాలకులు ప్రజలకు ఆర్థిక స్వేచ్ఛ అందించకుండా కల్లబొల్లి మాటలతో విభజించు.. పాలించు అన్న పద్ధతిని పాటిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కన్వీనర్ జనగామ తిరుపతి, ఎం.గోపాల్, సమతా సైనిక్ దళ్ నాయకులు దుర్గం నగేశ్, రైతు సంఘం నాయకులు ముడిమడుగుల మల్లన్న, న్యూ ఇండియా పార్టీ నాయకులు చాణక్య, నవీన్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు చేయాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రామగుండం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం సేకరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ పిలుపు మేరకు అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతుగా పార్టీ ప్రతినిధులు నిరసన తెలిపారు. ఎగ్లాస్‌పూర్ గ్రామ అధ్యక్షుడు బర్పటి తిరుపతి మాట్లాడుతూ రైతులపై మిల్లర్ల దోపిడీని అరికట్టాలని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యం ఎలాంటి షరతులు లేకుండా, తూకంలో కోత విధించకుండా కొనుగోలు చేయాలని కోరారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో లగిశెట్టి రాకేశ్, తూడూరి అజయ్, బర్పటి నవీన్, కందుల రామస్వామి, బియ్యాల పోశయ్య, చిలుక లింగయ్య, ఆడెపు సుధాకర్ ఉన్నారు.

మండలస్థాయి తనిఖీ అధికారుల బృందం పర్యటన



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: మండలంలోని నాగులపల్లెలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పీర్ మండల స్థాయి అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలో 2023లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలు, కంపోస్టు ఎరువుల తయారీ, యూనిట్లను పరిశీలించారు. పనుల వివరాఆలను ఎంపీడీవో వేణుగోపాలరావు, ఏపీవో సదానందం, పంచాయతీ కార్యదర్శులతో కూడిన బృందం నమోదు చేసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలవేని వీరయ్య, పంచాయతీ ఆపరేటర్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఏడీ, ఎంపీపీ

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన బొజ్జ రాజేశం 9నెలల క్రితం నర్సింహస్వామి అలయం వద్ద జరిగిన విద్యుత్ షాక్ ప్రమాదంలో మృతి చెందాడు. కాగా ఎన్‌పీడీసీఎల్ నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును బాధిత కుటుంబానికి చెందిన శ్రీనివాస్‌కు ఏడీ సత్యనారాయణ అందజేశారు. ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ భారతి జ్యోతిబసు, ఏఈ అశోక్, లైన్‌మెన్ సంపత్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ ఆలయంలో ప్రత్యేక పూజలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు అబ్బాపూర్‌లో హనుమాన్ మాలధారణ భక్తులు గురువారం శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అబ్బాపూర్‌లో హనుమాన్ భక్తులకు జూలపల్లి సర్పంచ్ నర్సింహయాదవ్ బంధువులు సామల శ్యామల, లక్ష్మీరాజం దంపతుల స్మారకార్థం భిక్ష ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ దండె వెంకటేశం, మేర శ్రీనివాస్, గన్ను వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వేణు, ఆవుల పోచమల్లు, నౌండ్ల మల్లారెడ్డి, చొప్పరి మహేశ్, పొన్నం సంతు, కొమురయ్య, పప్పు కుమార్ పాల్గొన్నారు.

✦ బీఆర్‌ఎస్ మండల అడ్వైజరీ కమిటీ నియామకం

ధర్మారం: బీఆర్‌ఎస్ మండల అడ్వయిజరీ కమిటీని మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం ప్రకటించారు. పార్టీ మండల అధికార ప్రతినిధిగా మోహన్‌రెడ్డి, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా పుస్కూరి నర్సింగరావు, పెంచాల రాజేశం, కాంపెల్లి చంద్రశేఖర్, చింతల జగన్మోహన్‌రెడ్డి, గందం రవీందర్, భాస్కర్ నాయక్, పాక వెంకటేశం, మహేందర్‌రెడ్డి, మూల మల్లేశం, జైన రామజౌళి, వెంకటేశ్వర్‌రావు, కోరుకంటి స్వామి, గూడూరి లక్ష్మణ్, కల్లెం హన్మంతరెడ్డి, రాజునాయక్, తిరుపతి, కొమురేశం, ఈదుల రాజేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి మల్లారెడ్డి, బండవరం సుమన్, శ్రీనివాస్, సందనవేని కొమురయ్యను నియమించారు.

✦ ఎస్సైని ఉద్యోగం నుంచి తొలగించాలి

గోదావరిఖని: ముస్లిం విద్యార్థినిపై దాడికి పాల్పడిన జగిత్యాల ఎస్సైని ఉద్యోగం నుంచి తొలగించాలని కోఆప్షన్ సభ్యురాలు తస్నీంబాను, ఎండీ రఫీ, సమన్వయ కమిటీ సభ్యులు ఖాజా సిరాజుద్దీన్, ఎంఏ హమీద్, సత్తార్‌ఖాన్, మీర్‌ఫయాజ్ అలీ, ఎండీ మున్వర్, మహ్మద్ సాజిద్ డిమాండ్ చేశారు.

✦ ఉపాధి పనులు పరిశీలన

ఓదెల: మండలంలోని కొలనూర్, గోపరపల్లె, నాంసానిపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో జి.సత్తయ్య గురువారం పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న ఎస్సారెస్పీ కాల్వల్లో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు.

సమాచారం

✦ 16న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు తెలిపారు. 18 నుంచి 40లోపు ఏళ్ల వయస్సు గల వారు విద్యార్హత సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 8985336947, 9502642441ను సంప్రదించాలని ఆయన సూచించారు.